
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

3★★

సోమవారం 19 ఆగస్టు 2024


ధర్మపురి ఆలయంలో భక్తుల రద్దీ 5లో..

మోరపల్లి బస్సు ఘటన పై కేటీఆర్ ట్వీట్ 5లో..


# తుది దశకు పంటల నమోదు




- నెలాఖరులోగా పూర్తికి చర్యలు
- పంటల బీమాపై అన్నదాతల ఆశలు
- సీజన్ ముగుస్తున్నా విడుదల కాని మార్గదర్శకాలు
- జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 3.14 లక్షల ఎకరాల్లో నమోదు పూర్తి

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏఏ పంటలు పండి స్తున్నారో వివరాలు అధికారులు సేకరించడం దాదాపుగా తుది దశకు చేరుకుంటోంది. వ్యవసాయ స్థలాల్లోకి వెళ్లి సాగు వివరాలను రైతులను అడిగి తెలుసుకుంటున్నారు. అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ జాబితా ఆధారంగానే అన్నదాతలకు రైతు భరోసా, బీమా, తదితర ప్రభుత్వ పథకాలు వర్తించే అవకాశాలున్నాయి. రైతు భరోసా పెట్టుబడి సొమ్ము సైతం జమ కానుంది. ప్రతీ సంవత్సరం వానాకాలం, యాసంగి కాలం సీజన్‌ల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. ఈనెలాఖరులోపు వానా కాలం పంటల సర్వే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఈ నమోదు ప్రక్రియ మరింత వేగవంతంగా జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా వరి పంట అత్య ధికంగా సాగు చేస్తుండగా, తదుపరి స్థానంలో మొక్కజొన్న, పసుపు, ఇతర పంటలున్నాయి.

## ఆన్‌లైన్‌లో నమోదు...

గతంలో పంట సాగు వివరాలను ఒకే చోట కూర్చొని కొందరు రైతుల నుంచి వివరాలను అడిగి సేకరించేవారు. దీంతో సాగు లెక్కల్లో కొంత హెచ్చు తగ్గులు కనిపించేవి. కానీ కొన్నేళ్లుగా పంటల వివరాలు పారదర్శకంగా నమోదు చేస్తున్నారు. ప్రతి పంట క్షేత్రానికి అధికారులు వెళ్లి పరిశీలిస్తున్నారు. పట్టాదారు పాసు పుస్తకం. సర్వే నంబర్ల వారీగా ఏ రకమైన పంటలు...ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారనే విషయాలు సేకరిస్తున్నారు. అనంతరం ఆ వివరా లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో రెవెన్యూ గ్రామాల వారీగా ఎన్ని ఎకరాల్లో ఎంత విస్తీర్ణంలో పంటలు పండి స్తున్నారో తేలనున్నాయి.

## అత్యధికంగా వరి సాగు..

జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా వరి సాగు అవుతోంది. ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ద్వారా వారాబంది పద్ధతిలో సాగు నీరు విడుదల చేస్తుం డ డం, వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసి చెరువులు, కుంటల్లోకి జలాలు నిండడం తదితర కారణాల వల్ల సాగు జోరుగా జరుగుతోంది. జిల్లాలో ప్రస్తు త సీజన్‌లో సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారన్న అంచనాలున్నాయి. ఇందులో ఇప్పటివరకు 3,14,907 ఎకరాలలో వివిధ పంటలను సాగు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో వరి 2,38,485 ఎకరాలు, మొక్కజొన్న 31,913 ఎకరాలు, జను ము 22,647 ఎకరాలు, పత్తి 16,950 ఎకరాలు, కంది 1,255 ఎకరాలు, సో యాబిన్ 352, అనుములు 296 ఎకరాలు, చెరుకు 626 ఎకరాలు, పసుపు సుమారు 12 వేల ఎకరాలు,మిగిలిన ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నట్లుగా అధికారులుగుర్తించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

## ఫసల్ బీమాపై స్పష్టత కరువు...

ప్రతికూల పరిస్థితుల్లో పంటలు దెబ్బతింటే అన్నదాతలకు అండగా ఉం డేందుకు ఫసల్ బీమా యోజన అమలుపై స్పష్టత రావడం లేదు. పథకం అమలు చేయాలని ప్రభుత్వ నిర్ణయించినప్పటికీ ఇందుకు అవసరమైన మార్గదర్శకాలు ఇప్పటివరకు విడుదల కాలేదు. అయితే వానాకాలం సాగు ప్రారంభమై వారాలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ పరంగా పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు రాకపోవడం అన్నదాతలను నిరుత్సాహానికి గురిచేస్తోంది. రాష్ట్రంలో కొన్నేళ్లుగా ఫసల్ బీమా పథకం అమలుకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో అమల వుతున్న ఈ పథకానికి గత ప్రభుత్వం వివిధ కారనాలతో దూరమవడమే ఇందుకు కారణంగా నిలిచిందని పలువురు రైతు భావిస్తున్నారు. వర్షాకాలం మరో రెండు నెలలే ఉన్నందున ఈలోపు భారీ వర్షాలు పడితే పంటలు చేతికందే సమయంలో నష్టపోవాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి మార్గదర్శకాలు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

> **ఈ జాబితాతోనే భరోసా, బీమా..**
>
> రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సొమ్మును ఈ జాబితా ప్రకారమే విడుదల చేయనుంది. గత ప్రభుత్వం సాగు చేయని భూములకు రైతు బంధు డబ్బులు మంజూరు చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. రైతు బీమా అమలు సైతం ఈ జాబితా అనుసరించి అమలు అవకా శాలున్నాయి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం పకడ్బందీగా పంటల సర్వేను చేపడుతోంది.

## పక్కాగా వివరాల నమోదు...: వాణి, జిల్లా వ్యవసాయ అధికారిణి



జిల్లా వ్యాప్తంగా పంటల నమోదు ప్రక్రియ తుది దశలకు చేరుకుంటోంది. ప్రతీ రైతు సాగు చేసిన పంటల వద్దకు సిబ్బంది వెళ్తున్నారు. మండల, జిల్లా స్థాయిలో అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ నెలాఖరులోపు దాదాపుగా సాగు వివరాలు ఆన్‌లైన్‌లో పూర్తిగా నమోదు కానున్నాయి. ఇటీవల ఏఈవోల బదిలీలు జరిగినప్పటికీ పంటల నమోదు ప్రక్రియ పూర్తి తదుపరి వెళ్లడానికి సమాయత్తం అవుతున్నారు.



పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

## ఎమ్మెల్యేకు పలు సంఘాల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న వాకర్స్ సంఘ నాయకులు

జగిత్యాల అర్బన్. ఆగస్టు 18: జగిత్యాల పట్టణ ధరూర్ క్యాంప్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ధరూర్ క్యాంప్‌లో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ట్రాక్ ఏర్పాటు చేయడం ద్వారా నిత్యం వాకింగ్ చేసే సీనియర్ సిటిజన్స్, మహిళలు, వృద్ధులకు ఎంతోగానో ఉపయోగం ఉంటుందన్నారు. తమ విజ్ఞప్తిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి కొత్త ప్రభాకర్, ట్రెజరర్ సునీల్ తదితరులున్నారు.

●అఖిల భారత విశ్వకర్మ పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కలిసి విశ్వబ్రాహ్మణ కో ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను విస్తృత పరుస్తూ విశ్వకర్మ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌గా నామకరణం చేస్తూ పరిశ్రమల శాఖకు అనుసంధానం చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు చింతల రాజేశ్వర్, బొమ్మన జలంధర్, శ్రీకాంత్‌చారి, శ్రీనివాస్, రాకేష్ తదితరులున్నారు.

●జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన దేవేంధర్‌కు సీఎం సహాయనిధి చెక్కు ద్వారా రూ.28,500 మంజూరవగా చెక్కును ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలగాని సత్యం, మెండె రమేష్ తదితరులున్నారు.

## నేతాజీ వర్ధంతి

జగిత్యాల అర్బన్. ఆగస్టు 18: పట్టణంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద స్వాతంత్ర్యసమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. బోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ సంస్థ స్థాపించి బ్రిటీషు వారి కంటికి కునుకు లేకుండా చేసి ప్రాణాలు విడిచిన మహనీయుడు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆ మహనీయుడికి నివాళులు అర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఏసీఎస్ రాజు, అక్కినపల్లి కాశీనాథం, పోచమల్లు, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లేశం, మల్లిఖార్జున్, ప్రవీణ్‌రావు, భూమయ్య, బాలయ్య, రాంచంద్రం, రాజేశ్వర్‌రావు ఉన్నారు.



## మృతుల కుటుంబాలకు బండి సంజయ్ పరామర్శ



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బండి సంజయ్

మల్యాల, ఆగస్టు 18: మల్యాలకు చెందిన బీజేపీ నాయకుడు గుండేటి గంగారాం భార్య లావణ్య ఇటీవల మృతి చెందగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే రామన్నపేటకు చెందిన బీజేపీ నాయకులు మాజీ సర్పంచ్‌లు అయిన భార్యభర్తలు వకుళాభరణం శ్రీనివాస్, అరుణ కూడా ఇటీవల మృతి చెందగా వారి కుమారుడిని పరామర్శించి మృతుకి కారణాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శనివారం మృతి చెందిన మద్దుట్లకు చెందిన ముస్కెల నరేందర్ కుటుంబసభ్యులను కూడా పరామర్శించారు. సంజయ్ వెంట మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, బీజేపీ జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

# రాజకీయ సమానత్వం కోసం పాపన్న కృషి

**ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్**

ధర్మపురి, ఆగస్టు 18: రాజకీయ, సామాజిక సమానత్వం కోసం సర్వాయి పాపన్న ఎంతో కృషి చేసినట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలి పారు. ధర్మపురి పట్టణంలోని చింతామణి చెరువు వద్ద మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పలువురు ప్రజా ప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు, సభ్యులు ఆయన విగ్ర హానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీకగా నిలిచారని అన్నారు. గతంలో గౌడ సంఘం నాయకులు కుల సంఘ భవనాలు, ఎల్లమ్మ తల్లి దేవాలయాల గురించి తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. త్వరలో వాటిని పరిష్కరిస్తానన్నారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో, కమలాపూర్ గ్రామంలో కూడ సర్వాయ్ పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఇందారపు రామయ్య, మండల గౌడ సంఘం అధ్యక్షులు పెరుమాండ్ల ఎల్లాగౌడ్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగన భట్ల దినేష్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, మల్లేశం, గంగాధర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

●ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముందస్తు రాఖీ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్స్ వేముల నాగలక్ష్మి, సంగనభట్ల సంతోషి, జక్కు పద్మ, గరిగె అరుణ, పలువురు మహిళలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతికి రాఖీ కట్టారు. అ నంతరం రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసి రాజకీయంగా మరింత ముం దుకు వెళ్లాలని ఆకాంక్షించారు.



ధర్మపురిలో సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాలలు వేస్తున్న విప్ అడ్లూరి



## సోదరభావానికి నిలువెత్తు నిదర్శనం రాఖీ

**ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్,ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి**



రాఖీ కడుతున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు

జగిత్యాల అర్బన్. ఆగస్టు 18: సోదరభావానికి నిలువెత్తు నిదర్శనం రాఖీ పండగ అని, ప్రజలలో మరింతగా సోదర, సోదరీ భావం పరిణవిల్లాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో జిల్లా మహిళా కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో రక్షబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించి విప్, ఎమ్మెల్సీతో పాటు, పలువురు కాంగ్రెస్ నాయకులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా విప్, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయల్లో రాఖీ పండగ ఒక గొప్ప వేడుక అని అన్నారు. సోదరభావం, ప్రేమానురాగాలతో ప్రతి యేటా శ్రావణ పౌర్ణమి నాడు రాఖీలు కట్టుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం అని, దీన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి సోదరభావం మరింత ఇనుమడింప జేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా కాం గ్రెస్ అధ్యక్షురాలు పిప్పరి అనిత, చరిష్మారెడ్డి, రజిత, స్వప్న, సాగరిక తదితరులున్నారు.

# అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

**- మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి**

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 18 : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని వేంపేట గ్రామంలో అక్రమంగా సేకరించిన ఆరు క్వింటాల రేషన్ బియ్యం తరలిస్తుండగా సీఐ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలానికి చెందిన కడమంచి అంజి, బాన్సుబాడకు చెందిన అంద్రాస్ గంగాధర్‌లు వేంపేట గ్రామంలో పలువురు నుంచి బియ్యం కిలోకు రూ. 15 చొప్పున ఆరు క్వింటాలను కొనుగోలు చేసి వాటిని రూ. 20 చొప్పున మెట్‌పల్లి పట్టణంలోని శాంతినగర్ కాలనీలో అమ్ముతున్నట్లు తమకు తెలిసిందన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు చెప్పిన సమాచారం మేరకు పట్టణంలోని మొటం రమేష్, కొండపల్లి మారుతి ఉండే స్థలాన్ని పరిశీలించగా అక్కడ లభ్యం అయిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్ ఫోన్లు, 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని సివిల్ సప్లైకి అధికారులకు తెలిపామన్నారు.



వేంపేటలో పట్టుకున్న రేషన్ బియ్యం చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

## రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక

కోరుట్ల, ఆగస్టు 18 : పట్టణంలోని తెలంగాణ వెల్ఫేర్ సొసైటీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపియినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బండి బాబు ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల మేనేజ్మెంట్ సౌజన్యంతో నిర్వహించిన యోగా పోటీలలో పట్టణంలోని గురుకుల విద్యార్థులు పాల్గొన్ని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలోని 12 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జగిత్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో నలుగురు గోల్డ్, నలుగురు సిల్వర్, మరో నలుగురు బ్రాంజ్ మెడల్స్‌కు పొందినట్లు తెలిపారు.

## విభిన్న ఫొటోగ్రఫీ..

# వారి హాబీ..

**నేడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం**



● శ్రీనివాస్ తీసిన చిత్రం

ధర్మపురి/మల్యాల, ఆగస్టు 18: ఫొటోగ్రఫీ వృత్తిలో జిల్లాకు చెందిన పలువురు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లలో పాల్గొని బహుమతులు, అవార్డులు సాధిస్తూ తమ ప్రతిభను చాటుకుంటున్నారు. కళాత్మక దృష్టితో ధర్మపురి, మల్యాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు వడ్లూరి రవిందర్, మండలోజు శ్రీనివాస్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. మండలోజు శ్రీనివాస్ 40 ఏళ్లుగా కళాత్మక చిత్రాలు తీస్తూ.. అవార్డులు సాధిస్తున్నాడు. పలు ఆకట్టుకునే చిత్రాలు తీస్తూ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటున్నారు. ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొన్ని ప్రత్యేక చిత్రాలు.



●శ్రీనివాస్ తీసిన చిత్రం





రవిందర్ తీసిన చిత్రాలు

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

**- నీళ్లు వేడి చేసేందుకు హీటర్ పెడుతుండగా ప్రమాదం**

మేడిపల్లి, ఆగస్టు 18: కట్లకుంట గ్రామంలో స్నానానికి నీళ్ల వేడి చేసేందుకు హీటర్ పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురై గడ్డం మాలకొండయ్య(48) అనే వ్యక్తి మృతి చెందాడు. నెల్లూరు జిల్లాకు చెందిన మాలకొండయ్య ఐదు నెలలుగా గ్రామంలో తాపీ పని చేస్తు న్నాడు. ఆదివారం స్నానం చేసేందుకు నీళ్లు పెడుతూ విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.



## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

**- కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల**



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం ఆదివారం కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 8,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్ర స్తుతం 49.117 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 5,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

## లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్, ఆగస్టు 18: మండలంలోని ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం సాయంత్రం ముందుగా వెళుతున్న ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కి చెందిన షేక్ ఫారూఖ్ కోడిగుడ్లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంపై కోడిగుడ్లను తీసుకొని ఇంటికి వెళుతున్నాడు. ఆ సమయంలో మండలంలోని ఇందిరానరగ్ గ్రామం సమీపంలో రాజీవ్ రహదారిపై హైదారాబా ద్ నుంచి కరీంనగర్‌కు అతివేగంగా వచ్చిన ఓ లారీ ఫారూఖ్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. కింద పడిన అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం చేసిన లారీ డ్రైవర్ వాహనం ఆప కుండా పారిపోయేందుకు యత్నించాడు. స్థానిక యువకులు లారీని వెంబడించి పట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఫారూఖ్‌కు కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని చేరుకొని ఫారూఖ్‌ను 108లో కరీంనగర్ తరలించారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల పట్టణంలోని నూతన బస్టాండ్ లో ఆదివారం గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని జగిత్యాల పట్టణ ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి గుర్తించారు. జగిత్యాల పట్టణ కొత్తబస్టాండ్ లో ఓ మహిళ అపస్మారక స్థితిలో పడిఉందని పోలీసులకు స మాచారం అందింది. ఈమేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మహిళను పరీ శీలించి చూడగా మహిళ మృతిచెంది ఉన్నది. మహిళ గులాబీ కలర్ స్వెటర్ ధరించి బ్రౌన్ కలర్‌చీర ధరించి ఉందని పట్టణ పోలీసులు తెలిపారు. సుమారు 40 ఏళ్లు ఉంటుందని తెలిపారు. మహిళ మృతదేహాన్ని జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మా ర్చురీగదిలో భద్రపరిచినట్లు ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మహిళ ఆచూకి ఎవరికైన తెలిస్తే జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

## అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లి వీధి వద్ద ఆదివారం రాజీవ్‌బైపాస్‌మీదుగా ప్రయాణిస్తున్నకారు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ధర్మపురివైపు నుంచి జగిత్యాల వైపు కారులో వెళ్తుండగా ఒక్కసారిగా బ్రేక్‌పై పడడంతో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

## ధర్మపురి క్షేత్రంలో భక్తుల సందడి



స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 18: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్త జన సందడి నెలకొంది. శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు అభిషేకం, అర్చన, హోమం, నిత్య కళ్యాణం టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు చేయించారు. అంతకు ముందు అనుబంధ ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉండదు

**- కేసీఆర్, కేటీఆర్ అంటేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి - కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్**

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 18: అవినీతి పార్టీగా ప్రజల్లో ముద్రపడిన బీఆర్‌ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ భారతీయ జనతా పార్టీకి లేదని, ప్రస్తుతం తెలంగాణలో కేసీఆర్, కేటీఆర్ పేరు ఎత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో మార్కండేయ ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మహా చండీయాగంలో బండి సంజయ్‌కుమార్ ఆదివారం పాల్గొనగా ఆలయ కమిటీ, పద్మశాలీ సంఘం నాయకులు, పద్మ పూజారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అవరణంలో జరుగుతున్న యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన నగల షోరూంను బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు అలవికాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకు వివీన డ్రామాలు ఆడుతున్నారన్నారు. రుణమాఫీ కానీ రైతులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు. రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పిందని 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 24 లక్షల మందికే మాఫీ చేయడం ఏమిటని అన్నారు. రైతులందరికి రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీలు ప్రకారం ఎన్నికల్లో రూ 40 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి బడ్జెట్‌లో రూ 26 వేల కోట్లు కేటాయించి చివరకు రూ 17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ లక్ష రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసినట్లు చెబుతూ మోసం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రైతులకు బ్యాంకుల నుంచి క్లియరెన్స్ సర్టిఫికేట్‌లను ఇప్పించాలని అన్నారు. రుణాలు తీసుకున్న రైతులకు క్లియరెన్స్ సర్టిఫికేట్‌లు రాకుంటే భవిష్యత్తులో ఎలాంటి రుణాలు పొందలేదనే విషయాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు. కల్యాణలక్ష్మి పథకానికి లక్ష రూపాయలు, తులం బంగారంతో సహా ఆరు గ్యారంటీలు ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. 30 వేల ఉద్యోగాలని చెప్పి కేవలం 12 వేల ఉద్యోగాలు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అద్దాల మేడలో కూర్చొని ప్రజలకు అన్నీ చేశామని అనుకుంటుందని అన్నారు. రైతు భరోసా, బోనస్, రుణమాఫీ చేస్తామని చేయలేదనే ప్రజలు తెలుసుకున్నారని అన్నారు. రైతులు అమాయకులు కాదని, వారు దుఃఖంలో ఉన్నారని వారికి భరోసా కల్పించడంతో పాటు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మోసపూరిత వాగ్దానాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ ప్రవీణ్‌రావు, కో కన్వీనర్ అడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, గరిపెల్లి ప్రభాకర్, అన్నల్‌దాస్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

# సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

**- టీఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్**




మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని టీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రానికి వచ్చిన జగదీశ్వర్‌ను పట్టణంలోని సంఘ కార్యాలయంలో పలువురు అసోసియేషన్ సభ్యులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ రూపకల్పనకు 15 మందితో రాష్ట్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల స్నేహపూర్వక సర్కారు అని చెప్పి చివరకు సంఘాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కనీసం ఒకటవ తేదీన వేతనాలను సైతం అందివ్వలేదని ఆరోపించారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటవ తేదీననే వేతనాలు, పెన్షన్లు అందిస్తుండడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలు, నగదు రహిత వైద్య సేవలు, 317 జీవో, సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు, పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు వంటి 36 సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకవెళ్ళుతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, కందుకూరి రవి బాబు, వొడ్నాల రాజశేఖర్, భైరం హరి కిరణ్, వెల్మల ప్రకాశ్‌రావు, రవిచంద్ర, రవీందర్, మమత, రాజేశం, సుగుణాకర్, మధుకర్, మహమూద్, భువనేశ్వర్, కుమార స్వామి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, ఆగస్టు 18: కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయంలోకి వస్తున్న ఇన్‌ఫ్లోలు ఆదివారం సాయంత్రానికి తగ్గాయి. రెండు, మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మోయతుమ్మెద వాగు నుంచి ఎల్‌ఎండీలోకి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగింది. కాగా వర్షాలు లేకపోవడంతో పై నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు తగ్గయి. శనివారం ఉదయం 1,190క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండగా సాయంత్రానికి 1,551క్యూసెక్కులకు పెరిగింది. ఆదివారం ఉదయం ఇన్‌ఫ్లో 2,197క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రం 6గంటల ప్రాంతంలో కేవలం 707 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రం 5.723టీఎంపీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



ఎల్‌ఎండీలో ఉన్న ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు

## గంజాయి కిట్ల సహాయంతో ఆరుగురు నిందితుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 18: గంజాయి కిట్ల సహాయంతో జిల్లా వ్యాప్తంగా ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం తెలిపారు. రెండు రోజుల వ్యవధిలోనే వీరి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయికి అలవాటు పడి తాగేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి విస్తృత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, గంజాయి రవాణాపై స్పెషల్ డ్రైవ్‌లు, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. జిల్లాలో విస్తృతంగా గంజాయి కిట్ల సహాయంతో టెస్ట్‌లు చేస్తూ గంజాయి సేవించే వారిని అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. సిరిసిల్లలో ఇద్దరు నిందితులైన ఒల్లెపు వంశీ, భీంరాజ్‌లను అదుపులోకి తీసుకొని 200 గ్రా ముల గంజాయిని, కోనరావుపేటలో ఇద్దరు నిందితులైన అరుణ్, అజ్మీర్‌వికాస్‌ల వద్ద 200 గ్రాముల గంజాయిని, తంగళ్లపల్లిలో ఇద్దరు నిందితులైన సాయి, సాగర్‌ల వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

## 25న సైక్లింగ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు



మాట్లాడుతున్న సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 18: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న జిల్లా రోడ్ సైక్లింగ్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ పాఠశాలలో ఆదివారం అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైక్లింగ్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, సైక్లింగ్‌తో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని వెలిచాల బైపాస్ రోడ్డులో 25న అండర్-14, 16, 18, 23, ఆపై వయస్సు విభాగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ స్వంత సైకిల్‌తో హాజరుకావాలన్నారు. సమావే శంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు రమేశ్, ఎస్.మనోహరాచారి, ఎస్.అన్వేష్, ఎస్ రాజయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలకు స్పందన



బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు18: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా యూత్ బాల బాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని టీజీఎస్‌పీడీసీఎల్ బాస్కెట్‌బాల్ మైదానంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 40 మంది బాలురు, 30 మంది బాలికలు హాజరై ప్రతిభ చాటారు. వీరిలో విశేష ప్రతిభ చాటిన 18 మంది బాలురు, 18 బాలికలను ఈనెల 24వరకు అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు. జిల్లా పోటీల నిర్వహణను జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి బి అనంతరెడ్డి పర్యవేక్షించారు. సీనియర్ క్రీడాకారులు, పీడీలు శ్రీధర్‌రావు, సునీల్‌కుమార్, దూడ సత్యానందం, అరుణ్‌తేజ, జీవన్‌కుమార్, వెంకటేష్, జాయ్ అనిల్, పర్మిత్‌కౌర్, అభి, జోయల్, హెన్రీ, శివకుమార్ పాల్గొన్నారు.

## అల్లుడిపై మామ దాడి

**- బండరాయితో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి**

జూలపల్లి, ఆగస్టు 18: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఆదివారం అల్లుడిపై మామ దాడిచేశాడు. తలపై రాడ్‌తో కొట్టడంతో అల్లుడైన జేజేల అశోక్ అలియాస్ చెత్తయ్య(40) మృతిచెందాడు. జూలపల్లి ఎస్ఐ శ్రీధర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచాపూర్ గ్రామానికి చెందిన జాడి కనుకయ్య తన అల్లుడైన అదే గ్రామానికి చెందిన అశోక్‌ను ఆదివారం మధ్యాహ్నం విందు ఇస్తానంటూ ఇంటికి పిలిపించుకున్నాడు. ఇంట్లో ఉన్న రాడ్‌తోపాటు బండరాళ్లతో అశోక్ తలపై కనుకయ్య బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పదేళ్లుగా తన భార్యతో అశోక్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో కనుకయ్య ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కూతురు జేజేల శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బైక్‌ను ఢీకొట్టిన కారు ..ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, ఆగస్టు 18: జగిత్యాల-కరీంనగర్ మార్గంలోని నూకపల్లి వరదకాలువ బ్రిడ్జి వద్ద మహారాష్ట్ర నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలు అయ్యాడు. కారు ఢీకొని వేగంగా ముందుకు దూసుకెళ్లగా పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన జనగాం బాలగౌడ్ అనే వ్యక్తి మహారాష్ట్ర నుంచి తన ద్విచక్రవాహనంపై తన స్వగ్రామం గూడెంకు వస్తుండగా వరదకాలువ బ్రిడ్జి వద్ద కారు ఢీకొట్టి వెళ్లింది. దీంతో కింద పడిన అతని ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు చికిత్స కోసం జగిత్యాలకు 108లో తరలించారు. ఢీకొని వెళ్లిన కారు కోసం ఎస్సై నరేష్‌కుమార్, పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. రెండు గంటల వ్యవధిలోనే వేములవాడ సమీపంలో కారును పట్టుకున్నారు. కారును స్వాధీనం చేసుకొని కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

వేములవాడ రూరల్, అగస్టు 18: పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చెక్కపల్లి గ్రామానికి చెందిన గీస శిరీష (20) డిగ్రీ పూర్తి చేసుకుని ఇంట్లో కుట్టుమిషన్ పనులు చేసుకుంటుంది. ఆదివారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శిరీష ఆదివారం రాత్రి మృతి చెందింది. శిరీష తండ్రి గీస లచ్చయ్య జీవనోపాధికై గల్ఫ్‌కు వెళ్లాడు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల వేధింపుల వల్లే తన చెల్లి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి అన్నయ్య గీస శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

## రెండేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి

**- గుర్తించిన పోలీసులు**

కోనరావుపేట, ఆగస్టు 18: రెండు సంవత్సరాల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయిన వ్యక్తిని ఆదివారం గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు సీఐ వేంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం గోవిందరావుపేట తాండకు చెందిన బానోతు నరేష్ అనే వ్యక్తి 2022 సంవత్సరంలో కుటుంబ సమస్యల కారణంగా ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్లి పోయాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు కోనరావుపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నరేష్ గురించి ఎలాంటి ఆచూకీ తెలవకపోవడంతో చందుర్తి సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ శేఖర్ రెడ్డి సిబ్బందితో టీం ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో పని చేస్తున్నాడని తెలుసుకొని అక్కడికి సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందిని పంపించి సమాచార సేకరించారు. బానోతు నరేష్‌తో సీఐ మాట్లాడగా తన కుటుంబ కలహాలు వల్ల ఇంటి నుంచి వెళ్లిపోయానని తెలిపాడు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శేఖర్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

## కొండగొర్రె మాంసం స్వాధీనం

గంభీరావుపేట, ఆగస్టు 18: గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామ శివారు ప్రాంతంలో కొండ గొర్రెను చంపిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనదేవి ఆదివారం తెలిపారు. అటవీ ప్రాంతంలో బండలు కొడుతున్న షరీఫ్, యాకూబ్ అనే వ్యక్తులు అటుగా వెళుతున్న కొండగొర్రెను రాళ్లతో కొట్టి చంపేశారు. చనిపోయిన కొండ గొర్రెను వండుకునే సమయంలో డీఆర్‌వో అంజలి పక్కా సమాచారంతో సిబ్బందితో వెళ్లి గొర్రె తలకాయ, కాళ్లు, మాంసాన్ని స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. కొండ గొర్రెను చంపిన వారిని పట్టుకున్న డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్‌ను ఎఫ్ఆర్‌వో అభినందించారు. షరీఫ్, యాకూబ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో కల్పనదేవి తెలిపారు.

# శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 8791 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.560 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

**- మిడ్ మానేరు నుంచి..**

**బోయినపల్లి:** మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6,300 క్యూసెక్కుల, మూల వాగు నుంచి 2930 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 312.65 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.76 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ కు 3200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

**- 'అన్నపూర్ణ'లోకి..**

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.14 టీఎంసీల నీరు చేరింది. మధ్యమానేరు ద్వారా 3,200 క్యూసెక్కుల నీటిని ఒక పంపు ద్వారా ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3,300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## గురుకులంలో సీటు ఇప్పిస్తానని మోసగించిన ఒకరిపై కేసు

మేడిపల్లి, ఆగస్టు 18: తన మిత్రుడికి ఎమ్మెల్యే తెలుసు అని నీ కొడుకుకు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని చెప్పి మహిళ దగ్గర నుంచి రూ 35 వేలు తీసుకుని మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసమోదు చేశారు. మేడిపల్లి మండలం రాజలింగంపేట గ్రామానికి చెందిన రేగుల రాజేందర్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మహిళ కొడుకుకు వేములవాడ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని రూ 35 తీసుకున్నాడు. తన మిత్రుడైన చందుర్తి మండలం కిష్టపేట గ్రామానికి చెందిన చిగురుల మల్లేశం ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్‌కు దగ్గర అని చెప్పి ఇద్దరు కలిసి మహిళ దగ్గర నుంచి డబ్బులు తీసుకున్నారు. కాగా ఆ తరువాత గురుకుల పాఠశాలలో ఫ్రీ సీటు వచ్చిందని తెలుసుకుని తనను మోసం చేశారని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

## మోరపల్లి బస్సు ఘటన పై కేటీఆర్ ట్వీట్

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్- మోరపల్లి గ్రామ శివారుల మధ్యలో జరిగిన బస్సు ప్రమాదం పై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 50 మంది ప్రయాణించాల్సిన బస్సులో 170 మంది ఎక్కారని, దాంతో మోరపల్లి వద్ద నిర్మల్ డిపో బస్సులో 170 మంది ప్రయాణిస్తున్న బస్సు వెనుక రెండు టైర్లు ఊడిపోయాయని, ఈ ప్రమాదంలో ఎవరు గాయపడకపోవడం అదృష్టమే అన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించారు. ఎందుకు అమాయక పౌరుల జీవితాలతో ఆడుకుంటున్నారని, బస్సుల సంఖ్యను పెంచాలని ఎప్పుడు ఆలోచిస్తారని, ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసే విషయంలో ఏదైనా భద్రత ప్రోటోకాల్ అనుసరిస్తున్నారా, అధికపనిచేసే డ్రైవర్లు, కండక్టర్లకు మీరు ఎలా పరిహారం చెల్లిస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.




సోషల్‌మీడియా వేదికగా కేటీఆర్ చేసిన పోస్ట్

## బిల్డింగ్ పైనుంచి పడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి



ప్రజ్వల్(ఫైల్)

వేములవాడ టౌన్, అగస్టు 18: బిల్డింగ్‌పై నుంచి పడి తలకు తీవ్రగాయాలైన బాలుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన నడిగొట్ల రాజేష్, లావణ్య దంపతుల కుమారుడు ప్రజ్వల్ (4) అనే బాలుడు నాలుగు రోజుల క్రితం కరీంనగర్‌లో తామ నివాసం ఉంటున్న బిల్డింగ్ పైనుంచి ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో కింద వున్న ఇనుప సీకులపై పడటంతో బాలుడి తలలో గుచ్చుకుని తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

**● ఆరెపల్లిలో విషాదం..**

వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ప్రజ్వాల్ చికిత్స పొందుతూ మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అములుకున్నాయి. బాలుడి చికిత్స కోసం రూ 20 లక్షల ఖర్చు అవుతాయని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దాతలు స్పందించి విరాళాలు అందించారు. బాలుడి చికిత్స కోసం ఇప్పటి వరకు రూ 8 లక్షల వరకు ఖర్చు అయినట్లు బాధితులు తెలిపారు. కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

# మరణిస్తూ ఐదుగురికి ప్రాణదానం

**- రోడ్డు ప్రమాదంలో యువకుడి బ్రెయిన్‌డెడ్ - అవయవదానానికి కుటుంబసభ్యుల అంగీకారం**

గంభీరావుపేట, ఆగస్టు 18: గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ద్యానబోయిన నరేష్(27) రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అవయవదాన ప్రాధాన్యాన్ని హైదరాబాద్ జీవన్ దాన్ సంస్థ, అపోలో వైద్యులు అవగాహన కల్పించారు. దీంతో పుటెడు దుఖంలో అవయవ దానం చేసేందుకు ఆ యువకుడి తల్లి అంగీకరించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ద్యానబోయిన నర్సింలు, దేవలక్ష్మి దంపతులకు నరేష్, నవిత ఇద్దరు సంతానం. రెండేళ్ల కిందట నర్సింలు అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ భారం కొడుకు నరేష్ మీద పడటంతో తల్లిని, చెల్లిని వదిలి ఏడాది కిందటే గల్ఫ్ బాట పట్టాడు. చెల్లి పెళ్లి చేసి, తాను పెళ్లి చేసుకుంటానని ఇటీవలనే ఇంటికి వచ్చాడు. లింగన్నపేటలో తన మేనమామ మృతి చెందగా, లింగన్నపేటకు వెళ్లి వస్తూ ఈ నెల 13న రైస్‌మిల్ వద్ద నరేష్(27) రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలయ్యాడు. ముందుగా ఎల్లారెడ్డిపేట అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆరు రోజులుగా మృత్యువుతో పోరాడి శనివారం నరేష్ బ్రెయిన్ డెడ్ అయ్యాడు. జీవన్ దాన్ అవయవ దానం గురించి అవగాహన కల్పించగా నరేష్ తల్లి అవయవ దానానికి అంగీకరించింది. నరేష్ కళ్లు, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలను దానం చేసి ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. దీంతో తన కొడుకు భౌతికంగా లేపోయినా ఐదుగురికి పునర్జన్మ కల్పించిన ఆ మాతృమూర్తిని పలువురు అభినందించారు.



నరేష్ శవపేటిక వద్ద రోదిస్తున్న బంధువులు(ఇన్‌సెట్‌లో నరేష్(ఫైల్)

## తీవ్ర గాయాలతో బ్రెయిన్‌డెడ్

**● అవయవదానం చేసిన కుటుంబసభ్యులు**



నరేందర్(ఫైల్)

**మల్యాల:** ఎదురెదుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబసభ్యులు మృతుడి అవయవాలు దానం చేశారు. మల్యాల మండలం మద్దుట్లకు చెందిన ముస్కెల నరేందర్ (51)అనే రైతు తన వ్యవసాయ పొలం వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో నరేంద ర్ తల, ముఖం తదితర చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్, హైదరాబాద్ తీసుకెళ్లారు ముఖం, దవడలకు తీవ్ర గాయాలు కాగ శస్త్ర చికిత్సలు చేశారు. తలకు అయిన తీవ్ర గాయాలతో రెండు రోజుల క్రితం బ్రెయి న్‌డెడ్ అయింది. దీంతో హైదరాబాద్‌లోని యశోధ ఆసుపత్రిలో కుటుంబసభ్యులకు అవయవదానంపై వివరించడం తో శనివారం రాత్రి కుటుంబసభ్యులు నరేందర్ కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులను దానం చేశారు. ఆదివారం మృతదేహం మద్దుట్లకు రాగ అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుని కుటుంబసభ్యులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పరామర్శించారు

# పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్-

### ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, ఆగస్టు 18: పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిల్వాకోడూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చెట్ల చంద్రశేఖర్ గౌడ్, సంఘం అధ్యక్షుడు దాసరి గంగన్న గౌడ్, మాజీ సర్పంచులు దాసరి నారాయణ గౌడ్, కందుకూరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గుండి బుజ్జన్న, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ ముజ్జు, విండో డైరెక్టర్లు కొమురయ్య, పాల్గొన్నారు.

**మల్లాపూర్** : సర్వాయి పాపన్న పోరాటాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసు కోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఆదివారం సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా మండలంలోని సిర్పూర్‌లోని ఆయన విగ్రాహానికి, మల్లాపూర్‌లో చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ సొసైటీ ఛైర్మన్ అంజిరెడ్డి, గౌడ సంఘాల నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**కోరుట్ల రూరల్:** పోరాట యోధుడు సర్వాయి పాపన్న అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. ఆదివారం మండలోని అయిలాపూర్ గ్రామంలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించి పాపన్న జయంతి వేడుకలో పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న పాపన్న విగ్రహానికి నివాళ్లను అర్పించారు. మండలంలోని పలు గ్రామాలలో గౌడ సంఘ ఆధ్వర్యంలో పాపన్న జయంతి వేడుకలను నిర్వహించారు. గౌడ సంఘ నేతలు గంగాధర్ గౌడ్, సురేష్‌గౌడ్, తుక్కారాంగౌడ్, సత్యానారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

**మెట్‌పల్లి రూరల్** : మండలంలోని ఆత్మనగర్ గ్రామంలో పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా విగ్రహానికి, వెల్లుల్ల గ్రామంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడు జుంగుల మారుతి గౌడ్, గౌడ సంఘం నాయకులు గంగారాం, రాజమల్లయ్యగౌడ్, విజయ్ పాల్గొన్నారు.

**మల్యాల:** బహుజన విప్లవ వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని మల్యాల, కొండగట్టు, తాటిపల్లి తదితర గ్రామాలో గౌడ సంఘాల ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. కొండగట్టులో పాపన్న గౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ సంఘం నాయకులు బుర్ర అంజయ్య, మల్లేశం గౌడ్, మల్లేశం, శ్రీను, అంజయ్య, మధు, శ్రీధర్, వంశీ, మనోజ్ పాల్గొన్నారు

**కొడిమ్యాల** : మండల కేంద్రంలోని గౌడ సంఘంలో ఆదివారం సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని గౌడ సంఘం నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రవిగౌడ్, ప్రసాద్‌గౌడ్, పర్శరాంగౌడ్, గంగాధర్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, నర్సాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశంగౌడ్, కార్యవర్గ సభ్యులు, మాజీ జడ్పీటీసీ నారాయణగౌడ్, బీఆర్ఎస్ మండల నాయకుడు వెంకటేష్‌గౌడ్, సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

**కథలాపూర్** : మండల కేంద్రంలో ఆదివారం సర్వాయి పాపన్న జయంతి గీత కార్మికులు ఘనంగా నిర్వహించారు. పాపన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్, సత్యనారాయణ, వివిధ గ్రామాల గీత కార్మికులు పాల్గొన్నారు.

**రాయికల్:** రాయికల్ పట్టణంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**జగిత్యాలరూరల్** : జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ రేణుకయూత్, జగిత్యాల మండలంలోని ధరూర్, రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సర్వాయిపాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా గోపా కార్యాలయంలో సర్వాయిపాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్వాయిపాపన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కల్లెడప్యాక్స్‌ఛైర్మన్ సందీప్‌రావు, మాజీ ఎంపీటీసీ షట్కూరిపరశురాంగౌడ్, మాజీ సర్పంచ్ మహేశ్వర్‌రావు, నర్సింగాపూర్ గౌడసంఘం అధ్యక్షుడు పులిమల్లేశంగౌడ్, ధరూర్‌గౌడ సంఘం అధ్యక్షుడు సుద్దాలరాజు, గోపా అధ్యక్షుడు రవీంధర్‌గౌడ్ పాల్గొన్నారు.



సిర్పూర్‌లో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



కోరుట్ల మండలం అయిలాపూర్‌లో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

**భీమారం:** మండల కేంద్రంలో గ్రామ ప్రజలు ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉత్కం శంకర్ గౌడ్, పల్లి అర్జున్, నాంచారి రాజేందర్, బాలసాని మారుతి, శర్మానందం గౌడ్, రఘు, ఎండీ రఫీ, నాగయ్య, నరేష్ పరమేశ్వర్, వెంకట్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

**రాయికల్:** మండలంలోని ఇటిక్యాల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గౌడ సంఘం అధ్యక్షుడు జవ్వాజి నర్సాగౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు ఉత్కం సాయగౌడ్, పాల్గొన్నారు. మండలంలోని అల్లీపూర్, ఒడ్డె లింగాపూర్ గ్రామాల్లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రేణుక గౌడ యువజన అధ్యక్షుడు జనార్ధన్ గౌడ్, ఉపాధ్యక్షుడు గొడ్డన్న, చిరంజీవి పాల్గొన్నారు.

**కోరుట్ల** : పట్టణంలోని కల్లూర్ రోడ్డులో ఆదివారం సర్వాయి పాపన్న జయంతి వేడుకలను కోరుట్ల కౌండిన్య గౌడ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాపన్న చిత్ర పటానికి పూల మాలవేసి నివాళ్లను అర్పించారు. అనిల్, తిరుమల గంగాదర్, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

**మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం)** : పట్టణంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలను సర్వాయి పాపన్న గౌడ రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు చర్లపెల్లి రాజేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాపన్న విగ్రహంకు పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘ మెట్‌పల్లి అధ్యక్షుడు పూదరి సుధాకర్ గౌడ్, గౌడ సంఘ నాయకులు సుఖేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సుభాష్ గౌడ్, రంగురామాగౌడ్, నర్సాగౌడ్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికపై హర్షం

జగిత్యాలరూరల్, ఆగస్టు 18 : కోదండరాం ఎమ్మెల్సీగా ఎన్నికకావడం పట్ల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జవ్వాజి శంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కోదంరాంను ఎన్నిక చేసిన కాంగ్రెస్‌కు తమ మద్దతు ఉంటుందన్నారు. ఉద్య మకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు.

## మొక్కలు నాటిన గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 18 : మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలోని అటవీ భూమిని కొందరు కబ్జా చేయడానికి చదును చేశారు. గ్రామంలోని అటవీ భూములను హస్తగతం చేసుకోనేందుకు కుట్ర పన్నుతున్నారనే నేపంతో ఆదివారం మాజీ సర్పంచ్ గజ్జెల నరేష్ నేతృత్వంలో గ్రామస్థులు మొక్కలు నాటారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్థులదని భావించి అక్రమంగా కబ్జాకు పాల్పడడానికి కొందరు కుట్రపన్నారు. దీంతో గ్రామస్థులు, అధికారుల సహాకారంతో అటవీ భూములు కాపాడుకోవాలి, పచ్చదనం పెంపొందిచి పర్యావరణం పరిరక్షించేందుకు మొక్కలు నాటామన్నారు. గ్రామంలో ఎవరైనా అటవీ భూములను అక్రమంగా కబ్జాకు పాల్పడితే ఊరుకనేది లేదని, దీనికి గ్రామస్థులంతా ఏకతాటిపై ఉండి భూములను కాపాడుకుంటామన్నారు.

## బండలింగాపూర్ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న శ్రీవర్ధన్ కుమార్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 18 : మండలంలో బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హనుమాన్ ఆలయంలోని పురోహితుడు చక్రపాణి మాధవచారి తనయుడు శ్రీవర్ధన్‌కుమార్ డాక్టరేట్ పట్టా పొందాడు. చెన్నైలోని సత్య భామ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పీహెచ్‌డీలో ఎలక్ట్రికల్ విభాగంలో కంజప్షన్ ఆఫ్ సిరీస్ ఓల్టేజ్ ఇష్యూస్ బెస్డ్ ఓన్ జడ్ డీవిఆర్ డిఫరెంట్ ఆప్టిమైజేషన్ పరిశోధన చేయడంతో శ్రీవర్ధన్‌కుమార్‌కు ఆదివారం యూనివర్సిటీ వారు డాక్టరేట్ పట్టాను అందించారు. శ్రీవర్ధన్‌కుమార్‌ను ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు అభినందించారు.

## మున్నూరు కుల బాంధవులు అధిక సంఖ్యలో తరలిరావాలి

గొల్లపల్లి, ఆగస్టు 18: జిల్లా మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవానికి మున్నూరుకాపు కుల బాంధవులు అధిక సంఖ్యలో తరలిరావాలని గొల్లపల్లి మండల అధ్యక్షుడు చెవుల రవీందర్ కోరారు. మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ నూతన జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నం తిరుపతి తదితర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు అవారి చందు, బంగడపు తిరుపతి, ఆయా గ్రామ సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వైకుంఠ రథం విరాళం

గొల్లపల్లి, ఆగస్టు 18: పెగడపల్లి మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న సీఎస్ఎన్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం తమ తండ్రి జ్ఞాపకార్థం వైకుంఠ రథం విరాళంగా అందించారు. దివంగత చింతకింది సత్యనారాయణ కుమారులు కిరణ్, కిషోర్, రఘు, ఆయన సతీమణి, మాజీ ఎంపీటీసీ చింతకింది అనసూర్యలు వైకుంఠరథాన్ని గ్రామానికి విరాళంగా అందించారు. అనంతరం సత్యనారాయణ 3వ వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు నివాళులు అర్పించారు.

## నిత్యాన్నదానానికి విరాళం

మల్యాల, ఆగస్టు 18: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సిద్దిపేటకు చెందిన భక్తుడు ఆదివారం విరాళం అందించారు. సిద్దిపేటలోని భరత్‌నగర్‌కు చెందిన వెంకటరమణ అనే భక్తుడు రూ.50వేలను అన్నదానం ఇన్‌చార్జీ రాజేంధర్‌రెడ్డికి అప్పగించారు.

## కొవ్వొత్తులతో నివాళులు

మల్యాల, ఆగస్టు 18: కలకత్తాలో మెడికల్ విద్యార్థినిపై జరిగిన హత్యాచార దాడికి నిరసనగా మండలంలోని ముత్యంపేటలో శ్రీమార్కండేయ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో యువకులు నివాళులు అర్పించారు. చక్రధర్, త్రినాథ్, శ్రీనివాస్, నవీన్, సాయి, మహేందర్, వంశీకృష్ణ, అనిల్, భగవాన్, సాగర్, రోహిత్ పాల్గొన్నారు

## పండుగల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



విద్యార్థికి ప్రశంసా ప్రతం అందిస్తున్న ఉపాధ్యాయులు, సేవా సమితి సభ్యులు

కోరుట్ల, ఆగస్టు 18 : పండుగల సంప్రదాయ సంస్కృతి కాపాడాలని లిటిల్ జీనియర్ పాఠశాల కరస్పాడెంట్ మహాదేవ్ అన్నారు. ఆదివారం పట్టణ సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో లిటిల్ జీనియస్ పాఠశాలలో విద్యార్థులకు రక్షబందన్ పర్వదినం పురస్కరించుకోని పండుగలు వాటి సంప్రదాయాలపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. రాణించిన విద్యార్థులకు సేవా సమితి సభ్యులు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు శ్రీపతి విశ్వసాయి తేజ, జికూరి నరేంధర్, శ్రీపతి రోహిత్, చడ శివ, పిన్నంశెట్టి రాహుల్, ప్రిన్సిపల్స్ రాదాకృష్ణ పాల్గొన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

మల్లాపూర్, ఆగస్టు 18 : కోల్‌కత్తలో వైద్యావిద్యార్థిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని విశ్వాహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న ఘటనలపై, వైద్యవిద్యార్థికి నివాళులర్పించారు. నిందితులను పట్టుకుని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, ఆమె కుటుంబానికి సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి నిందితులకు వెంటనే శిక్ష అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వాహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

**భీమారం:** పశ్చిమ బెంగాల్ ఆర్‌జికార్ ప్రభుత్వ ఆస్పత్రిలో పీజీ చదువుతున్న విద్యార్థిని అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు బక్కూరి నరేష్ అన్నారు. సమాజంలో ఇలాంటి చీడ పురుగులకు బహిరంగంగా అతి ఘోరంగా శిక్షలు విధిస్తేనే ముందు ఇలాంటి ఘటనలు జరుగకుండా ఉండేందుకు దోహదపడతారని అన్నారు.

## ఉత్తమ సేవలకు గుర్తింపు



జగ్గసాగర్‌లో ప్రభుత్వ ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 18 : ఉత్తమ సేవలకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం పదోన్నతి పొందిన ట్రాన్స్‌కో విద్యుత్ సిబ్బందితో పాటు ఉత్తమ అవార్డు అందుకున్న ఏఈవో భూమేశ్వర్‌లను స్థానిక నాయకులతో కలిసి శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు.

## రుణమాఫీపై ఆందోళన చెందవద్దు

కథలాపూర్, ఆగస్టు 18 : రుణమాఫీపై రైతులు ఆందోళన చెంద వద్దని వ్యవసాయాధికారిణి యోగిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రు. 2 లక్షల రుణమాఫీ విషయంలో రైతులు అనేక అపోహలు వెలిబుచ్చు తున్న నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వం సందేహాలు నివృత్తి చేస్తుందన్నారు వ్యవసాయ శాఖ ద్వారా సూచించబడిన నిర్ణీత కాలవ్యవధిలో స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని చెప్పారు.

## హిందూ ధర్మ రక్షణ ఆర్‌ఎస్ఎస్ ధ్యేయం

రాయికల్, ఆగస్టు 18: దేశం కోసం, ధర్మం కోసం స్వయం సేవకులు కంకణబద్ధులై ఉండాలని విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటనర్సయ్య అన్నారు. పట్టణంలోని విస్డమ్ పాఠశాలలో ఆదివారం ఆర్ఎస్ఎస్ రాయికల్ శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ రాయికల్ ఖండ కార్యవాహ వి.స్వామి యాదవ్, జిల్లా సమరసత బాధ్యులు టి.రవీందర్, కె.మల్లారెడ్డి, అశోక్, జి.గంగాధర్, స్వయం సేవకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

బీర్‌పూర్, ఆగస్టు 18: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన పూదూరి లింగయ్య ఇల్లు కూలిపోవడంతో ఆ కుటుంబం తల దాచుకునే చోటులేక అనాధలుగా మారారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డి ఆదివారం లింగయ్య కూలిపోయిన ఇల్లు పరిశీలించి కుటుంబాన్ని పరామర్శించారు. అంతే కాకుండా లింగయ్య అనారోగ్యంతో బాధప డుతుండగా గమణించిన ఎమ్మెల్సీ మెరుగైనా వైద్యం కోసం హైదారాబాద్‌లో చికిత్స చేయిస్తానని హామి ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన చెట్పల్లి దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా మృతుడు దేవయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, కొల్వాయి సింగిలివిండో ఛైర్మన్ నవీన్ రావ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుభాష్ యాదవ్, నాయకులు గుడిసె జితేంధర్ యాదవ్, అక్కినపెల్లి సంపత్, కండ్లపెల్లి శేఖర్, శ్రీనివాస్, శంకర్, వెంకటేష్, దనుంజయ్, రవీందర్ పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న జీవన్‌రెడ్డి

# దరఖాస్తుల ఆహ్వానం

ధర్మపురి, ఆగస్టు 18 : పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు స హాయ వంట మనిషి పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎం ఈవో గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు స్థానికులై ఉండా లని, 7వ తరగతి పాసై ఉండాలన్నారు. వివరాకు9491324967 ఫోన్ నెం బర్‌లో సంప్రదించాలన్నారు. మగ్గిడి గర్ల్స్ హాస్టల్‌లో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌ఉమన్ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీక రిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై, సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా శిక్షణ పొంది ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తుకు ఈనెల 22వ రకు చివరి తేదీ అన్నారు.

**గొల్లపల్లి:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశా లలో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో జమునా దేవి తెలిపారు. సహాయక వంట మనిషి, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు స్థానికులై ఉండాలన్నారు. అదనపు సహాయక వంట మనిషికి 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి పని చేయటంలో అనుభవం ఉండాలన్నారు. దరఖాస్తులను కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల కార్యాలయంలో ఈ నెల 22వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. వివరాలకు ప్రత్యేకాధికారి వి.పద్మ 8328091819లో సంప్రదించాలని పేర్కొన్నారు.

**మల్యాల:** మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్, మల్యాల శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వంట మనిషి, నైట్ వాచ్‌మన్ నియామకానికి మండలానికి చెందిన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో అయిత శ్రీనివాస్ తెలిపారు. నూ కపల్లి మోడల్ స్కూల్ బాలికల వసతిగృహంలో హెడ్ కుక్-1, నైట్ వాచ్ ఉమెన్-1, అలాగే కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అసిస్టెంట్ కు క్-2, నైట్ వాచ్‌ఉమెన్-1 కోసం కంట్రాక్టు పద్ధతిలో అర్హులైన స్థానిక మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న పేర్కొన్నారు. హెడ్ కుక్ పో స్టు కోసం పదవ తరగతి పాస్, అసిస్టెంట్ కుక్ కోసం 7వ తరగతి పాసై వంటల తయారీలో అనుభవం ఉండాలన్నారు. మండలానికి చెందిన వారై 18 నుంచి 45 ఏళ్ల లోపు గల వారు కుక్ కోసం దరఖాస్తులు చేసుకో వాలని తెలిపారు. నైట్ ఉమెన్ కోసం పదవ తరగతి పాస్, ఏజన్సీ ద్వారా శిక్షణ పొంది ఉండాలని ఆసక్తి గల వారు ఈ నెల 23లోపు మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయంలో అందించాలని సూచించారు

**కొడిమ్యాల** : కొడిమ్యాలలోని కేజీబీవీలో అదనపు సహాయక వంట మనిషి పోస్టుకు ఈ నెల 23లోగా మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతు న్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో అయిత శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకునె వారు మండల స్థానికులై ఉండి 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండా లన్నారు. వంట చేయడంలో అనుభవం ఉండాలన్నారు. వివరాలకు 9246895051 సంప్రదించాలన్నారు.

**రాయికల్:** మండలంలోని ఇటిక్యాలలో గల మోడల్ స్కూల్ బాలి కలహాస్టల్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యే కాధికారి ఎస్.శోభారాణి, ఎంఈవో గంగాదర్ తెలిపారు. ఖాళీగా ఉన్న వంట మనిషి 1, సహాయక వంట మనిషి 1, నైట్ వాచ్ ఉమెన్ ఒక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు మండల స్థానికులై ఉండాలని, వంట మనిషికి 10 తరగతి పాసై ఉండి వంట చేయుటలో అనుభవం కలిగి ఉండాలన్నారు. నైట్ వాచ్ ఉమెన్‌కు 10వ తరగతి పాసై ఉండి సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా శిక్షణ పొంది ఉండాలని, అదనపు సహాయక వంట మనిషికి 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఈ నెల 23వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు.

**కోరుట్ల రూరల్** : మండలంలోని కల్లూర్ మాడల్ స్కూల్‌కు అను సంధా నంగా ఉన్న బాలికల హస్టల్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులను ఆహ్వా నిస్తున్నట్లు హస్టల్ ఇన్‌చార్జి కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ ఆదివారం తెలిపారు. హాస్టల్‌లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, వంట సిబ్బంది, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, నైట్ వాచ్‌మెన్ పోస్టులు పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

# వరి నాట్లలో బిహార్ కూలీలు

● వ్యవసాయ పనులు చేసేందుకు జగిత్యాల జిల్లాకు రాక ● కూలీలు దొరక్క పొరుగు రాష్ట్రం నుంచి పిలుపు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వరి నాట్లు వేయడంలో ఎదురవు తున్న కూలీ సమస్యలు అధిగమించేందుకు అన్నదాతలు పొరుగు వలస కూలీలపై ఆధారపడుతున్నారు. సీజన్‌లో నాట్లు వేయడానికి కూలీలు లభించకపోవడం, దొరికిన కూలీల ధరలు ఎక్కువగా ఉండడం, అర్థాంత రంగా పనులు వదిలి ఎక్కువ కూలీలు డిమాండ్ చేస్తుండడం తదితర సమస్యలను ఎదుర్కొంటున్న రైతులు బీహార్ నుంచి వస్తున్న కూలీలల కు పనులను అప్పగిస్తున్నారు. సుమారు మూడు, నాలుగు సంవత్సరా లుగా బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కూలీలు జగిత్యాల జిల్లాకు వలస బాట పడుతున్నారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సుమారు 3.05 లక్షల ఎకరాలల్లో వరి సా గు చేస్తారన్న అంచనాలున్నాయి. బీహార్ కూలీల రాకతో వరి నాట్లు ము మ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు ముప్పాతిక శాతం వరి నాట్లు పూర్తయినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. అ ధిక మొత్తంలో వరి పండిస్తుండడంతో నాట్లు వేయడానికి కూలీల సమ స్య ఎదురవుతోంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో కూలీల స మస్య మరింత పెరగడంతో పొరుగు రాష్ట్రమైన బీహార్ వాసు లను జగిత్యాల జిల్లాకు రప్పించి నాట్లు వేసే పనులను అప్ప గిస్తున్నారు.



జగిత్యాల జిల్లా తిప్పన్నపేటలో నాట్లు వేస్తున్న బీహార్ కూలీలు

**● బీహార్ నుంచి జగిత్యాలకు...**

వానాకాలం సీజన్‌లో వరి నాట్లు వేయడానికి సుమారు 150 మంది కూలీలు బీహార్ నుంచి జగిత్యాల జిల్లాకు వచ్చారు. ఉపాధిని వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చి ముమ్మరంగా నాట్ల పనులు చేస్తున్నారు. 15 నుంచి 20 మందికి ఒక జట్టు చొప్పున రెండు జట్లుగా ఏర్పడి వ్యవసాయ కూలీ పనులు నిర్వహిస్తున్నారు. ఎకరానికి డిమాండ్‌ను బట్టి సుమారు 4,500 నుంచి రూ. 6,000 వరకు తీసుకుంటున్నారు. ఒక్కో రోజు రెండు జట్లు సుమారు అయిదు, ఆరు ఎకరాల్లో వరి నాటు పనులు పూర్తి చేస్తున్నారు. పలువురు ప్రైవేటు ఏజెంట్లు బీహార్ నుంచి జగిత్యాల జిల్లాకు వరి నాట్ల కోసం కూలీలను తీసుకువస్తున్నారు. వీరికి పనులు నిర్వహిస్తున్న ఆయా గ్రామాల్లో గల కమ్యూనిటీ హాళ్లు, సంఘ భవనాల్లో ఆశ్రయం కల్పిస్తున్నారు. బీహార్ కూలీలకు కొందరు రైతులు భోజన వసతిని సైతం ఏర్పాటు చేస్తు న్నారు. స్థానిక కూలీలు రోజుకు మహిళలకు రూ. 700, పురుషు లకు రూ. 1,000 చొ ప్పున వసూలు చేస్తున్నారు. ఒక్క ఎకరంలో నాట్లు వేయడానికి నలు గు రు పురుషులు, ఇరువురు మహిళలు అవసరమవుతుంటారు. వరి నాట్లు పనుల్లో బీహార్ కూలీలను దించడం వల్ల వేగవంతంగా అవుతున్నాయని అన్నదాతలు అంటున్నారు. నారు పీకడం, నారు కట్టలు కట్టడం, నారు పంచడంతో పాటు నాటు వేసే పనులను నిర్వహిస్తున్నారు. నాటు వేసే ప్రక్రియలో వ్యవసాయ భూమికి రెండు వైపులా తాడు కట్టుకొని సమా నంగా వరుస క్రమంలో నాట్లు వేస్తున్నారు. దూరం దూరంగా నాటు వే దయంతో విస్తారంగా గాలి సోకి, అధిక పిలకలు వచ్చి, ఏపుగా పెరిగి పంట దిగబడి అధికంగా వస్తుందని భావించి బీహార్ కూలీలతో నాట్లు వేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. వీరు నాటు వేసే విధానంతో చీడ పీడల బెడద తక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు.

**● ఉపాధి కోసమే వలస వచ్చాం**


**జవాడే చంద్రప్రకాశ్, వ్యవసాయ కూలీ, బీహార్**



బీహార్ రాష్ట్రం నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చాము. వరినాట్లు వేస్తున్నాం. ఇక్కడి రైతులు ఉపాధి అందించడంతో పాటు మాకు భోజ న వసతి, ఇతర సహకారాలు అందిస్తున్నారు. నాట్లు ముగియగానే తిరిగి వెళ్లి పోతాము.

**● బీహార్ కూలీలతో త్వరగా పనులు**

**- చింతకుంట్ల గంగాధర్, రైతు, గ్రామం తిప్పన్నపేట,**



వరి నాట్లు వేయడానికి స్థానికంగా కూలీల సమస్య తయారైంది. దీనిని అధిగమించేందుకు ఏజెంట్ల ద్వారా బీహార్ నుంచి వచ్చిన కూలీలకు పనులు అప్పగిస్తున్నాము. ఎకరానికి రూ. 5 వేలు తీసుకుంటు న్నారు. త్వరగా పనులు చేస్తున్నారు. పలువురు రైతులు బీహార్ కూలీలతో నాట్ల పనులు చేయించుకుంటున్నారు.